క్లుప్తంగా

పీడీఎస్‌యూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని అర్బన్: స్థానిక కిడ్డీస్ పాఠశాల ఆవరణలో పీడీఎస్‌యూ–2023 క్యాలెండర్‌ను మంగళవారం విద్యావేత్త కేశవ నారాయణ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పీడీఎస్‌యూ పాత్ర ఎంతో ఉందన్నారు. క్యాలెండర్‌లో పండుగలు, పబ్బాలు, ముహూర్తాలు, గుర్తించుకోవాల్సిన విషయాలను రాసుకోవడానికి కూడా పేజీలు ఉన్నాయన్నారు. నాయకులు అనిల్, పవన్, రవి, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

కౌతాళం: స్థానిక 9 వార్డులో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కౌతాళం 9వ వార్డులోని ఎన్టీఆర్ కాలనీలో పారిశుద్ధ్యం లోపించిందని, ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీలో పేరుకు పోయిన చెత్తచెదారంను తొలగించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇంటి వద్ద ఉన్న డ్రైనేజీలో పూడికను తామే తొలగించుకుంటున్నామని తెలిపారు. ఇకనైనా పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జీఓ నంబర్–1పై నిరసన

ఆదోని రూరల్: జీఓ నంబర్–1కు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సీనియర్ నాయకులు మహానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సీఐటీయూ జాతీయ మహాసభలను ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు బెంగళూరు నగరంలో నిర్వహించనున్నారని, జయప్రదం చేయాలని ఉద్యోగ కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్, లక్ష్మన్న, నాయకులు పాల్గొన్నారు.

వంతెనను పునఃనిర్మించాలి



దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని అర్బన్: పట్టణంలో నడిబొడ్డున ఉన్న పాత ఓవర్ బ్రిడ్జిని పునఃనిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, పట్టణాధ్యక్షుడు మహాదేవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పాత ఓవర్ బ్రిడ్జిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జి దాదాపు 65 సంవత్సరాల క్రితం నిర్మించారని, ప్రస్తుతం బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందన్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాత బ్రిడ్జిని పునఃనిర్మించేందుకు నివేదికలు తయారు చేసి జిల్లా కలెక్టర్, సీఎం, నేషనల్ హైవే అథారిటీ మంత్రికి పంపాలని కోరారు. నాయకులు వడ్డె శ్రీనివాసులు, ఉరుకుందుగౌడ్, విజయ్, ముఖేష్, విష్ణు, రామకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ అసిస్టెంట్ సిరాజ్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయు నాయకులు

కోసిగి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, నాణ్యమైన కందిపప్పు అందించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్–1 రద్దు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సిరాజ్‌అహ్మద్‌కు అందజేశారు. సీఐటీయూ మండల నాయకులు వీరేష్, రామాంజినేయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి నోట జగనన్న పాట

- పట్టలేని సంతోషంతో రావాలి జగన్.. కావాలి జగన్ పాట పాడిన అవ్వ
- రౌడూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అపూర్వ సంఘటన
- సంక్షేమ పాలనతో ఊరూరా వెల్లివిరుస్తున్న సంతోషం : వై.బాలనాగిరెడ్డి



రౌడూరులో వృద్ధురాలు ఎల్లమ్మకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కౌతాళం: అవ్వా బాగున్నావా అని ఎమ్మెల్యే పలకరించగానే.. పట్టరాని సంతోషంతో ఎమ్మెల్యే తలపై అక్షింతలు వేసి ఆశీర్వదిస్తూ 'రావాలి జగన్.. కావాలి జగన్' అంటూ పాట అందుకుంది. కాస్త కూడా బిడియం లేకుండా వృద్ధురాలు అందరి ఎదురుగుండానే పాటను ఆలపించింది. ఎల్లమ్మ అనే అవ్వ కురిపించిన అభిమానం ఇది. ఇంటి వద్దకే పింఛన్ వస్తుండటంతో అవ్వాతాతల నుంచి ఇలాంటి సంతోష సంఘటనలు తారసపడుతూనే ఉన్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కౌతాళం మండలం రౌడూరు గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌తో కలిసి 320 ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ ఊరికి వెళ్లినా అవ్వాతాతలు తమపై అనురాగ ఆప్యాయతలు చూపుతున్నారని పేర్కొన్నారు. ఇదంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనా ఫలితమేనని సంతోషం వ్యక్త పరిచారు. నవరత్నాలు సంక్షేమ పథకాల అమలుతో పాటు సచివాలయ వ్యవస్థ తీసుకురావడంతో మంచి స్పందన ఉందన్నారు. పేదల సంక్షేమం కోసం జగనన్న చేస్తున్న మేలు మెచ్చుకోదగ్గ విషయం అన్నారు. వ్యవసాయ, విద్యా, పారిశ్రామిక, మహిళా రంగాల అభ్యున్నతికి జగనన్న కృషి అమోఘమన్నారు. రౌడూరు గ్రామంలో మూడేళ్లలో సంక్షేమం రూపేణా రూ.15 కోట్లకుపైగా వెచ్చించామని తెలిపారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.1.17 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు త్వరలో నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పల్లెల్లో తమ పార్టీ బాగా పుంజుకుందన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని 'ఇదేమి ఖర్మ' కార్యక్రమాలు చేపట్టినా ఫలితం శూన్యమన్నారు. కార్యక్రమంలో ఉరకుంద ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజు గౌడ్, సర్పంచ్ సుశీల, ఎంపీడీఓ జగన్‌మోహన్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుసుమ, ఎంపీపీ అమరేష్, నాయకులు నర్సరెడ్డి, సోమిరెడ్డి, సుధాకర్ రెడ్డి, ఏకాంబర రెడ్డి, వైస్ ఎంపీపీలు బుజ్జిస్వామి, లిఖిత రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడూ కొనసాగనున్న కార్యక్రమం

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం రౌడూరు గ్రామంలో రెండవ రోజు కొనసాగుతుందని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం



ఆడ బిడ్డను చూపుతున్న అంబులెన్స్ సిబ్బంది

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన వడ్డె సుజాత అనే నిండు గర్భిణిని మూడో కాన్పు నిమిత్తం అంబులెన్స్‌లో కోసిగి పీహెచ్‌సీకి తీసుకెళుతుండగా మార్గం మధ్యలోనే ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం వేకువజామున గర్భిణికి ప్రసవ నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. కోసిగి నుంచి అంబులెన్స్ అక్కడికి చేరుకొని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో అంబులెన్స్‌లోనే ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈఎంటీ రామకృష్ణ, పైలట్ దేవేంద్ర సురక్షితంగా ఆమెను కోసిగి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. తల్లీబిడ్డను సురక్షితంగా ఆస్పత్రికి చేర్చడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ హాస్టళ్లలో వసతులు కల్పించాలి



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డె శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ హాస్టళ్లలో 56 వేల మంది విద్యార్థులు అరకొర వసతులతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,109 హాస్టళ్లలో వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.అలాగే 1600 మంది వంట మనుషులు, వాచ్‌మెన్‌ల నియామకం చేపట్టాలన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణువర్దన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహాదేవ్, ప్రధాన కార్యదర్శి ఉరుకుందగౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు వెంకటేష్, ముఖేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.6.44 కోట్లతో తాగునీటి పథకాలు

కౌతాళం: మండలానికి జలజీవన్ మిషన్ పథకం కింద రూ.6.44 కోట్లతో 15 తాగునీటి పథకాలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుసుమ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. అగసలదిన్నె గ్రామానికి రూ.24.61 లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, బంటకుంట గ్రామంలో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి రూ.23.64 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. అలాగే చిరుతపల్లి గ్రామంలో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకుతో పాటు గ్రామంలో పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.55.78 లక్షలు, చూడి క్యాంపులో పైప్‌లైన్ కోసం రూ.7.83 లక్షలు, కామవరం గ్రామంలో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకుతో పాటు పైప్‌లైన్ కోసం రూ.81.36 లక్షల రూపాయల నిధులు విడుదలైనట్లు ఆమె వివరించారు. అలాగే కరణి గ్రామానికి అదనపు పైప్‌లైన్ కోసం రూ.12.40 లక్షలు, కౌతాళంలోని రాజానగర్ క్యాంపునకు రూ.11 లక్షలు, కుంటనహాల్ గ్రామంలో ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకుతో పాటు పైప్‌లైన్ కోసం రూ.75.50 లక్షలు, మదిర గ్రామానికి పైప్‌లైన్ కోసం రూ.8.13 లక్షలు, రౌడూరు గ్రామంలో ఓహెచ్‌ఆర్‌ఎస్‌తో పాటు పైప్‌లైన్ కోసం రూ.43.20 లక్షలు, సుళేకేరి గ్రామానికి ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణంతో పాటు అదనపు పైప్‌లైన్‌కు రూ.76.71 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. అలాగే తిప్పలదొడ్డి గ్రామానికి ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు, అదనపు పైప్‌లైన్ కోసం రూ.52.58 లక్షలు, తోవి గ్రామానికి ఓహెచ్‌ఆర్ ట్యాంకుకు రూ.56.35 లక్షలు, ఉప్పరహాల్ గ్రామంలో ఓహెచ్‌ఆర్‌ఎస్‌తో పాటు పైప్‌లైన్ కోసం రూ.58.94 లక్షలు, ఉరుకుంద గ్రామానికి ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకు నిర్మాణంతో పాటు అదనపు పైప్‌లైన్ కోసం రూ.56.35 లక్షల నిధులు మంజూరైనట్లు ఆమె వివరించారు. ఇప్పటికే ఈ పనులను కుంటనహాల్, ఉప్పరహాల్, రౌడూరులో ప్రారంభించామని మిగతా గ్రామాల్లో కూడా త్వరలోనే ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

గడ్డివాము దగ్ధం

నందవరం: మండల పరిధిలోని గురజాల గ్రామంలో మంగళవారం గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన కురువ నరసింహులు తన ఇంటి సమీపంలో పశువులకోసం గడ్డివాము వేసుకున్నాడు. మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో స్థానికులు, ఆపద మిత్ర వలంటీర్లు ఆర్పేందుకు అగ్రిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. బాధిత రైతు కురవ నరసింహులు మాట్లాడుతూ దాదాపు రూ.60 వేల విలువ చేసే గ్రాసం కాలిపోయిందని వాపోయాడు.

రేపు క్రికెట్ టోర్నీ

గోనెగండ్ల: సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో ఈనెల 12 నుంచి తాలూకా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామకృష్ణ, దస్త గిరి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ విజేతలకు మొదటి బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారు లు 11వ తేదీలోపు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి 9912632217, 9885641857 సంప్రదించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

సేవలు ప్రజలకు అందాలి

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు

పత్తికొండటౌన్: గ్రామ సచివాలయాల సేవలు ప్రజలకు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పత్తికొండ డివిజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్లు, ఎంపీడీఓలు సమన్వయంతో గ్రామసచివాలయాల సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలన్నారు. రెవెన్యూశాఖకు సంబంధించి 62 రకాల సేవలుండగా.. చిప్పగిరి మండలం అత్యధికంగా 36 సేవలు అందించారన్నారు. మిగిలిన మండలాల్లో తక్కువ సేవలు అందుతున్నాయన్నారు. బిల్లుల పేమెంట్‌కు సంబంధించి 24 సేవలు ఉండగా ఆస్పరిలో 15 సేవలు అందించారన్నారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల్లో తక్కువగా 4 సేవలు మాత్రమే నమోదయ్యాయన్నారు. విద్యుత్‌శాఖకు సంబంధించి 12 సేవలు ఉండగా దేవనకొండ, హాలహర్వి మండలాల్లో ఒక్క సేవ కూడా అందించలేదన్నారు. భూహక్కు పత్రాలను వలంటీర్ లాగిన్ నుంచి త్వరగా పూర్తి చేయాలన్నారు. వీఆర్‌ఓల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల కుల ధ్రువీకరణ పత్రాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థను తహసీల్దార్లు, ఎంపీడీఓలు పూర్తిగా నియంత్రణలోకి తీసుకోవాలన్నారు. వారంలో ఒకసారి సచివాలయాలను తనిఖీ చేసి, అక్కడ అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరును పరిశీలించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇళ్ల నిర్మాణం, ప్రాధాన్య భవనాల నిర్మాణం, పాఠశాలల తనిఖీలు చేపట్టేలా చూడాలన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. గ్రామసచివాలయాల సర్వీసులను పెంచి జిల్లాను రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంచేలా కృషిచేయాలన్నారు. అనంతరం మండలంలోని చిన్నహుల్తి గ్రామం జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్‌దాసు, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, తహసీల్దార్లు విష్ణుప్రసాద్, సుదర్శన్, రవి, నాగరాజు, ఎంపీడీఓలు పార్థసారథి, మహబూబ్‌బాషా, నరసింహమూర్తి, గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్న తహసీల్దారుపై చర్యలు తీసుకొని, అక్రమ భూ హక్కు పత్రాలను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, ఆదోని పట్టణ కార్యదర్శి సుదర్శన్ కోరారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ పరిధిలో సర్వే నంబర్లు 174/1, 173/3, 177/1, 177/3ఎ లోని ప్రభుత్వ భూములను గతంలో పని చేసిన వీఆర్‌ఓ (రిటైర్డ్) అదే గ్రామానికి చెందిన కురువ లక్ష్మన్న పేరిట అక్రమంగా నమోదు చేయించారన్నారు. ఈ భూమి నిరుపేదలకు దక్కాలని సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఉద్యమాల వల్ల సదరు భూమి పెండింగ్‌లో ఉందన్నారు. ప్రస్తుత తహసీల్దారు భూములను సర్వే చేయకుండానే సర్వే చేసినట్లు నిర్ధారించి పట్టాదారు పాసు పుస్తకాలను మంజూరు చేశారని మండిపడ్డారు. అక్రమంగా పాసుపుస్తకాలు పొందిన వ్యక్తిపై చర్యలు తీసుకొని పేద రైతులకు భూములను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు సమర్పించారు. సీపీఐ నాయకులు రాజు, ఆంజనేయులు, తిక్కన్న, సర్దార్‌పటేల్, గోపాల్ నరసింహులు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎన్‌ఏ పరీక్షలకు ససేమిరా!

- ఖరీఫ్ పత్తి పంటలు దెబ్బతినడానికి లోతుగా పరిశీలన
- డీఎన్‌ఏ పరీక్షలకు వ్యవసాయ శాఖ నిర్ణయం
- రెఫరెన్స్ శాంపిల్స్ పంపించాలని కంపెనీలకు ఆదేశం
- రెండు నెలలైనా స్పందించని విత్తన కంపెనీలు



దెబ్బతిన్న పత్తి పంట

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట గతంలో ఎపుడూ లేని విధంగా దెబ్బతినడానికి కారణాలను మరింత లోతుగా విశ్లేషించేందుకు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అయితే డీఎన్‌ఏ పరీక్షలకు విత్తన కంపెనీలు ఏ మాత్రం సహకరించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించాలంటే రైతుల పొలాల నుంచి లైవ్‌శాంపుల్స్, కంపెనీల నుంచి విత్తన వెరైటీలకు సంబంధించిన రెఫరెన్స్ శాంపుల్స్ పంపాలి. రెండింటిని పరీక్షిస్తే తేడా తెలుస్తుంది. దీని ద్వారా పత్తి దెబ్బతినడానికి విత్తనం కారణమా... వాతావరణ పరిస్థితులే కారణమా.. అనేది స్పష్టమవుతుంది.

32 లైవ్ శాంపిల్స్ సేకరణ..

ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట దెబ్బతినడంపై రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గుంటూరు లామ్, నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల బృందం జిల్లాలో పర్యటించి పత్తి పంటను పరిశీలించింది. పత్తి పంట దెబ్బతినడానికి వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాలు, చీడపీడలు కారణమని తేల్చింది. అయితే రైతులు, రైతు సంఘాలు మాత్రం విత్తనం కారణంగా పత్తి దెబ్బతినిందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ డీఎన్‌ఏ పరీక్షలు చేయించాలని నిర్ణయించింది. రెండు నెలల క్రితం వ్యవసాయ అధికారులకు లైవ్ శాంపుల్స్, కంపెనీలకు రెఫరెన్స్ శాంపుల్స్ పంపాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ యంత్రాంగం మాత్రం 32 లైవ్ శాంపుల్స్ కింద ఆకులు సేకరించి గుంటూరు డీఎన్‌ఏ ల్యాబ్‌కు పంపింది. అయితే కంపెనీలు మాత్రం స్పందించలేదు. శాంపుల్స్ పంపడం లేదంటే కంపెనీల్లోనే పత్తి పంట దెబ్బతినడానికి కారణాలు దాగి ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

8 కంపెనీలకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు

తులసీ సీడ్స్ ఆకీర 171 బిజీ2 రకం, అంకూర్ సీడ్స్ అంకూర్ 3228, మహికో సీడ్స్ ఎంఆర్‌సీ 7160, ఎంఆర్‌సీ 7161, గోల్డ్‌కాంట్ ఎస్‌సీఎస్864. కావేరి సీడ్స్ మణిమేకర్, సూపర్ సీడ్స్ శ్రీభవ్య, సూపర్ 3జీ, రాశీ సీడ్స్ ఎస్‌ఈవో 578, కర్షక్ క్రాప్ సైన్స్ సూపర్ వైట్, టియారా సీడ్స్ డీపీసీ9085 రకాలకు రెఫరెన్స్ శాంపుల్స్ పంపాలని రెండు నెలల క్రితం వ్యవసాయ శాఖ ఆదేశించినప్పటికీ స్పందన లేదు. డీఎన్‌ఏ పరీక్షలకు కంపెనీలు సహకరించకపోతుండటాన్ని వ్యవసాయ శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. రెఫరెన్స్ శాంపుల్స్ ప్రతి కంపెనీ ప్రతి రకానికి తీసి పెట్టి ఉంటుంది. రెఫరెన్స్ శాంపుల్స్ కింద ఆకులు, పత్తి విత్తనాలు, పత్తి కాయలు ఇలా ఏవైనా పంపవచ్చు. అయితే కంపెనీలు పట్టించుకోకపోవడం చర్చనీయాంశం అవుతోంది. నిర్లక్ష్యం వహిస్తున్న 8 కంపెనీలకు నోటీసులు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ సిద్ధమవుతోంది.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మరకట్టు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో తాగు నీటి ఎద్దడి, సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులను వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. అంతకుముందు గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ శ్రీరాములు, మండల కన్వీనర్ వీరేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీంనాయుడు, మాజీ సర్పంచ్ గంగమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జున రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జయా ఉచ్చీరప్ప మాజీ ఎంపీటీసీ సభ్యుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

12న ఐరన్‌బండలో..

దేవనకొండ మండలం ఐరన్‌బండ గ్రామంలో ఈనెల 12న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరీదేవి మంగళవారం తెలిపారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొననున్న కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాతృమరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ గర్భిణుల పట్ల ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది అయిన ఆశ, ఏఎన్‌ఎంలు త్వరగా గర్భిణులను గుర్తించి వారిని ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయించాలన్నారు. ప్రతి నెలా 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేయించి, అవసరమైన వైద్యం అందే విధంగా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణులు వారిలో ఉంటే నిత్యం వారిని పర్యవేక్షణలో ఉంచాలన్నారు. కాన్పుకు వారం రోజుల ముందుగానే వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తే మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. అంతకుముందు ఆయన కలుదేవకుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని సింగరాజుపల్లెకు చెందిన గర్భిణి డిసెంబర్ 13వ తేదిన అధిక రక్తస్రావం వల్ల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించినట్లు నిర్ధారించి, దానిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాంజీనాయక్, డీఐవో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, వైద్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): గణతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గణతంత్ర వేడుకల నిర్వహణపై అధికారులతో ఆయన సమావేశమయ్యారు. 12 శాఖలకు శకటాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చారు. వాహనాలకు నాలుగు వైపులా ఆ శాఖ ప్రాముఖ్యతను తెలిపేలా సందేశాలు ఉండాలన్నారు. హౌసింగ్, విద్యా, డీఆర్‌డీఏ, డ్వామా, ఆరోగ్య, వ్యవసాయం, సర్వే, అగ్నిమాపక తదితర శాఖలు ఏర్పాటు చేసే శకటాలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. అలాగే 20 శాఖలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించేలా స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలాన్నరు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగుల వివరాలను సేకరించాలని, వారికి ఉత్తమ సేవాపతకాలు ఇవ్వనున్నట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, సీపీఓ అప్పలకొండ, డీఆర్‌డీఏ పీడీ ఎం.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.